

ప్రత్యేక రైలు ప్రారంభోత్సవంలో రాష్ట్ర మంత్రి పీకే శేఖర్‌బాబు, ఏజే శేఖర్, మహావీర్ బోత్రా తదితరులు

పరవశం.. తన్మయత్వం

● శ్రీవారిని దర్శించుకున్న 1008 మంది అనాథ, దివ్యాంగ చిన్నారులు

ప్యారీస్, ఆగస్టు 5: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అనాథాశ్రమాలకు చెందిన చిన్నారులు తిరుమల శ్రీవారిని దర్శించుకొని పరవశంతో తన్మయత్వం చెంది పులకించిపోయారు. స్థానిక టినగర్‌లోని టీటీడీ లోకల్ అడ్వయిజరీ కమిటీ సహకారంతో రోటరీ డిస్ట్రిక్ట్ 3233, ది మ్యాజిక్ ఆఫ్ రోటరీ, రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై నోబుల్ హార్ట్ సంయుక్తంగా 1,008 మంది అనాథ, మానసిక దివ్యాంగులు, అంధులకు ఈ సదవకాశం కల్పించాయి. డా.ఎంజీఆర్ సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో సోమవారం ఉదయం 7.10 గంటలకు దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరైన పచ్చజెండా ఊపి ఈ ఆధ్యాత్మిక యాత్రను ప్రారంభించారు. టీటీడీ చెన్నై లోకల్ అడ్వయిజరీ కమిటీ మాజీ చైర్మన్లు ఏజే శేఖర్, నూతలపాటి శ్రీకృష్ణ, రోటరీ క్లబ్స్ డైరెక్టర్ అనిరుద్ రాయ్ చౌదరి, సదరన్ రైల్వే చెన్నై డివిజనల్ మేనేజర్ బి.విశ్వనాథ్ ఈరియా, రోటరీ జిల్లా గవర్నర్ ఎస్.మహావీర్ బోత్రా ఈ రైలును సాగనంపారు. రోటరీ క్లబ్‌ల ప్రతినిధులు, సలహా మండలి మాజీ సభ్యులు సుమారు 400 మంది బాజాభజంత్రీలు, గోవింద నామస్మరణల మధ్య తిరుమలకు బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి పీకే శేఖర్‌బాబు మాట్లాడుతూ... 6 నుంచి 16 ఏళ్లలోపు అనాథలైన దివ్యాంగులను తిరుమలకు తీసుకెళ్లి శ్రీవారి దర్శనం చేయించడం గొప్ప ఆలోచన అని నిర్వాహకులను అభినందించారు. కాగా, ఈ ప్రత్యేక రైలులో చిన్నారులకు 25 రకాల వస్తువులతో కూడిన ఆహార పదార్థాల కిట్ అందజేసి, మొత్తం 1,540 మందిని తిరుమలకు సాగనంపారు. ఈ రైలు ఉదయం 10 గంటలకు రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకున్న నేపథ్యంలో, అక్కడి నుంచి 31 బస్సుల్లో తిరుమలకు వెళారు. అక్కడి నుంచి బ్యాటరీ వాహనాల్లో వృద్ధులు, దివ్యాంగుల షెడ్ వద్దకు చేరుకొని శ్రీవారిని దర్శించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విస్తారంగా వర్షాలు

● నీలగిరి జిల్లాను వీడని వాన

● గూడలూరు ప్రాంతంలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం



బంగాళా ఖాతం పశ్చిమ దిశ గాలుల వేగంలో మార్పుల కారణంగా రాష్ట్రంలో ఈ నెల 10వ తేది వరకు పలు ప్రాంతాల్లో భారీవర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ శాఖ హెచ్చరించింది. నగరంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన వర్షం కారణం గా ప్రధాన రోడ్లలో వరద నీరు భారీగా నిలిచింది. దీంతో, వాహన చోదకులు ఇబ్బందుల పాలయ్యారు.

ప్యారీస్, ఆగస్టు 5: స్థానిక నుంగంబాక్కంలోని వాతావరణ శాఖ కార్యాలయం సోమవారం తన ట్విట్టర్‌లో నమోదుచేసిన ప్రకారం... వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో మోస్తరు, భారీ వర్షాలు కురుస్తున్నందున ఆనకట్టలు, చెరువులు, వాగులు నిండుతున్నాయి. నీటివనరుల్లో అధిక స్థాయిలో నీటినిల్వలు పెరగడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలోని సముద్రతీర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం ప్రభావంతో పశ్చిమ దిశ గాలుల వేగం మారుతోందని, అందువల్ల చెన్నై సహా 17 జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. రాజధాని నగరంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి ఎగ్మూర్, గిండి, మధురవాయల్, మాంబళం, మైలాపూర్, తాంబరం, పెరంబూర్, ఎంకేబీ నగర్ సహా పలు ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ప్రధాన రోడ్లపై నీరు పారింది. కొన్ని ప్రాంతాల్లో మెట్రో, భూగర్భ డ్రైనేజీ పనులు జరుగుతుండడంతో ప్రధాన రోడ్లు జలమయం కావడంతో వాహన



చోదకులు ఇబ్బందులు పడ్డారు. దక్షిణ చెన్నై పరిధిలోని షోలింగనల్లూర్‌లో 12 సెం.మీ, అడయార్, ఐఐటీ ప్రాంతాల్లో తలా 10 సెం.మీ వర్షపాతం నమోదైంది. అదే సమయంలో నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. అడయార్ హైరోడ్డులో భారీ చెట్టు కూలడంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రోడ్లపై చేరిన వర్షపు నీరు, కూలిన చెట్లను కార్పొరేషన్ సిబ్బంది తొలగిస్తున్నారు. నగరంలోనే కాకుండా గడిచిన 24 గంటల్లో కురిసిన భారీవర్షాలకు పలు చోట్ల జనజీవనం స్తంభించింది. గరిష్ఠంగా నైవేలీలో 11 సెం.మీ, కాంచీపురంలో 10, పెరంబలూరులో 8, నుంగంబాక్కం, మీనంబాక్కం, చెంగల్పట్టు, విరుదాచలంలో తలా 4 సెం.మీ వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో సముద్రతీర జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరికలు జారీ అయ్యాయి. మంగళవారం నుంచి 10వ తేది వరకు దక్షిణ జిల్లాలు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

స్తంభించిన జనజీవనం

పర్వత శ్రేణులు అధికంగా ఉన్న నీలగిరి జిల్లాలో భారీగా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభించింది. జూన్ నెలలో కురిసిన కుండపోత వర్షాలకు కొండచరియలు, చెట్లు విరిగిపడడంతో ఘాట్ రోడ్డులో వాహనా ల రాకపోకలను నిలిపివేశారు. అదే విధంగా పలు గిరిజన గ్రామాలకు విద్యుత్ సరఫరా కూడా ఆపేశారు. ఈ నేపథ్యంలో, వర్షం ప్రభావంతో జిల్లాలోని గూడలూరు సమీపంలో ఉన్న కొక్కల్ ప్రాంతంలో ఇళ్ల గోడల కు బీటలు బారాయి. దీంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. బీటలు బారిన గూడలూరు మున్సిపాలిటీ పరిధిలో 21వ వార్డు గోపాల్ కాలనీ ని ఐఐటీ నిపుణులు సోమవారం పరిశీలించారు. సుమారు 80కి పైగా కుటుంబాలను అక్కడి నుంచి ఖాళీ చేయించారు. 15కు పైగా ఇళ్లు, ప్రార్థనా మందిరం, వృద్ధాశ్రమంలో బీటలు ఏర్పడడంతో 48 మంది వృద్ధులను పునరావాస కేంద్రానికి తరలించారు. పరిశీలించిన ఐఐటీ నిపుణులు గోపాల్ కాలనీలో కొండ చరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీంతో అధికారు లు ఆ ప్రాంతంలోని ఆస్పత్రిలో ఉన్న రోగులను ఊటీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఔట్ పేషంట్ విభాగాలు మూసివేశారు. కేంద్ర పురావస్తు పరిశోధన విభాగం నిపుణులు, భద్రతా విభాగం అధికారులు మంగళవారం మళ్లీ ఈ ప్రాంతంలో పరిశీలిస్తారని తెలిసింది. గోపాల్ కాలనీ ప్రాంతం, పరిసరాల్లో ప్రజలు సంచరించేందుకు నిషేధం విధించి హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.



రామకృష్ణన్‌కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కమిషనర్ సుఖపుత్ర

తిరునల్వేలి మేయర్‌గా రామకృష్ణన్

● ప్రత్యక్ష ఎన్నికలో స్వల్ప మెజార్టీతో విజయం

పెరంబూర్, ఆగస్టు 5: తిరునల్వేలి కార్పొరేషన్ మేయర్ ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థిగా పోటీచేసిన రామకృష్ణన్ 30 ఓట్లతో విజయం సాధించారు. ఆయనకు ప్రత్యర్థిగా పోటీచేసిన అసమ్మతి కౌన్సిలర్ పౌల్‌రాజ్‌కు 23 ఓట్లు మాత్రమే వచ్చాయి. తిరునల్వేలి మేయర్‌గా ఉన్న శరవణన్ చేత డీఎంకే అధిష్ఠానం రాజీనామా చేయించింది. అనంతరం మేయర్ అభ్యర్థిని ఎంపిక చేసేందుకు పురపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ, ఆర్థిక శాఖ మంత్రి తంగం తెన్నరసు నేతృత్వంలో డీఎంకే కార్పొరేటర్ల సమావేశం ఆదివారం జరిగింది. డీఎంకేకు చెందిన 6వ వార్డు కార్పొరేటర్ల పౌల్‌రాజ్, కొందరు కార్పొరేటర్లు ఈ సమావేశానికి గైర్హాజరయ్యారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం 25వ వార్డు కార్పొరేటర్ రామకృష్ణన్‌ను మేయర్ అభ్యర్థిగా డీఎంకే ప్రకటించిన నేపథ్యంలో, ఆయన సోమవారం ఉదయం 10.30 గంటలకు నామినేషన్ వేశారు. అలాగే మరో కార్పొరేటర్ పౌల్‌రాజ్ కూడా మేయర్‌గా పోటీచేస్తున్నట్లు ప్రకటించి నామినేషన్ వేశారు. అనంతరం నామినేషన్ల పరిశీలన జరిగింది. ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు నామినేషన్ ఉపసంహరణకు సమయం కేటాయించారు. ఇద్దరిలో ఎవరూ నామినేషన్ వెనక్కి తీసుకోకపోవడంతో మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రత్యక్ష ఎన్నిక నిర్వహించారు. కార్పొరేషన్ కమిషనర్ సుఖపుత్ర నేతృత్వంలో ఎన్నిక జరగగా, 53 మంది కార్పొరేటర్లు పాల్గొన్నారు. ముందుగా మాజీ మేయర్ శరవణన్ మధ్యాహ్నం 12.10 గంటలకు ఓటు వేసేందుకు వచ్చారు. ఆయన్ని అధికారులు అడ్డుకుని, లోపలికి పంపమని తెలిపారు. సమావేశానికి ఆలస్యంగా వచ్చిన వారిని అనుమతించలేమని స్పష్టం చేశారు. ఈ విషయమై ఆయన ఎన్నికల అధికారి, కార్పొరేషన్ కమిషనర్‌ను కలిసి వివరణ ఇవ్వడంతో అతడిని అనుమతించారు. ఇక, కార్పొరేషన్‌లోని 55 మంది కార్పొరేటర్లలో 54 మంది ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొన్నారు. అన్నాడీఎంకే కార్పొరేటర్ జగన్నాథన్ మాత్రమే సమావేశానికి హాజరుకాలేదు. అనంతరం ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో అధిక ఓట్లు పొందిన రామకృష్ణన్‌దే పైచేయి అయింది. ఆయనకు ప్రత్యర్థిగా పోటీచేసిన పౌల్‌రాజ్ తక్కువ ఓట్ల తేడాతో పరాజయం పొందారు. రామకష్ణన్‌కు 30 ఓట్లు, పౌల్‌రాజ్ 23 ఓట్లు సాధించారు. ఒక ఓటు చెల్లనిదిగా నమోదైంది. ఎన్నిక అనంతరం రామకృష్ణన్‌కు గెలుపు పత్రం అందజేశారు. దీనికి ముందు డీఎంకే అభ్యర్థి రామకృష్ణన్ తన సైకిల్‌పై కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చి నామినేషన్ దాఖలుచేశారు.



సమావేశానికి సైకిల్‌పై వస్తున్న మేయర్

కోవై మేయర్ అభ్యర్థిగా రంగనాయకి



పెరంబూర్, ఆగస్టు 5: కోయంబత్తూర్ కార్పొరేషన్ మేయర్‌గా వ్యవహరించిన 19వ వార్డు కార్పొరేటర్ కల్పన గత నెల తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో, కొత్త మేయర్ ఎన్నికకు మంగళవారం ప్రత్యక్ష ఎన్నిక నిర్వహించనున్నట్లు తమిళనాడు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. కార్పొరేషన్ కమిషనర్ ఎం.శివగురు ప్రభాకరన్ ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారు. ఈ నేపథ్యంలో, కొత్త మేయర్ అభ్యర్థి ఎవరన్న విషయమై అధికార పార్టీ కార్పొరేటర్లలో చర్చ ప్రారంభమైంది. మండల అధ్యక్షులు, స్టాండింగ్ కమిటీ చైర్మన్ల పేర్లు పరిశీలనకు వచ్చాయి. 100 డివిజన్లు ఉన్న కోవై కార్పొరేషన్‌లో 96 స్థానాల్లో డీఎంకే, కూటమి పార్టీల అభ్యర్థులు విజయం సాధించారు. అందువల్ల మేయర్ అభ్యర్థిగా ప్రకటించే వారు పోటీలేకుండా ఎన్నికయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో, మేయర్ అభ్యర్థి కోసం కార్పొరేటర్ల సమావేశం సోమవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ నేతృత్వంలో జరిగింది. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శులు సహా ముఖ్య నేతలు పాల్గొన్నారు. సమావేశంలో సూచనలు, చర్చల అనంతరం 29 వార్డు డీఎంకే కార్పొరేటర్ రంగనాయకి కోవై కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు. ఆమె మంగళవారం ఉదయం నామినేషన్ వేయనున్నారు. మేయర్ పదవికి మరెవరూ నామినేషన్ దాఖలుచేయని పక్షంలో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికవడం ఖాయంగా కనిపిస్తోంది.



నిర్మాణంలో వున్న పవర్ జనరేషన్-డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ భవనాన్ని పరిశీలిస్తున్న సీఎం

సిఫార్సులు వస్తున్నాయ్... కానీ ఫలితం లేదు

● ఉదయనిధికి డిప్యూటీ సీఎం ఇవ్వడం సాధ్యం కాదన్న స్టాలిన్

చెన్నై, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడు, డీఎంకే యువజన విభాగం అధ్యక్షుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారనే వార్తలపై ముఖ్యమంత్రి స్టాలిన్ ఎట్టకేలకు స్పందించారు. ఉదయనిధికి డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని సిఫార్సులు వస్తున్న మాట వాస్తవమేనని, కానీ అవేవీ ఫలించలేదని సరదాగా వ్యాఖ్యానించారు. తన సొంత నియోజకవర్గం కొళత్తూరులో ఆయన మరోమారు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించడంతో పాటు మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. అలాగే, అనేక మంది లబ్ధిదారులకు ప్రజా సంక్షేమ సహాయాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు. ఉదయనిధికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని అనేకమంది కోరారని, కానీ, అవేవీ ఫలించలేదని , పైగా ఇప్పట్లో అది సాధ్యం కాదని స్పష్టం చేశారు. అదేసమయంలో మంత్రివర్గ మార్పులు చేర్పులపై మీడియా అడిగిన ప్రశ్నలకు సీఎం సమాధానాలు దాటవేశారు. అయితే, ఆదివారం కురిసిన వర్షంపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, ఆదివారం ఒక్క రోజే 12 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. ఎంత వర్షం కురిసినా, వర్షపాతం నమోదైనా ఆ పరిస్థితులను ఎదుర్కొనేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.


రూ.109 కోట్లతో ఆస్పత్రి నిర్మాణం

నియోజకవర్గ పరిధిలోని పెరియార్ నగర్‌లో ప్రభుత్వ ప్రత్యేక ఆస్పత్రిని రూ.109.89 కోట్లతో ఆరంతస్తుల్లో నిర్మిస్తున్న నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అదేవిధంగా నియోజకవర్గంలో రూ.8.45 కోట్లతో పూర్తి చేసిన పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు కొత్తగా రూ.3.25 కోట్లతో మరికొన్ని కొత్త అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. తనికాచలంలో రూ.91.36 కోట్లతో నిర్మిస్తున్న ఉపరితల నీటి ప్రవాహ కాలువ పనులను ఆయన పరిశీలించారు. కొళత్తూరు ఎమ్మెల్యే అభివృద్ధి నియోజకవర్గ నిధులతో శ్రీనివాసన్ నగర్ మూడో ప్రధాన శాలైలో నిర్మించే ప్రాథమిక పాఠశాల భవానికి ఆయన శంకుస్థాపన చేశారు. నేర్మై నగర్‌లో సీఎండీఏ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మార్కెట్ పనులను ఆయన తనిఖీ చేశారు.

సీఎం వెంట రాష్ట్ర మంత్రులు ఎం.సుబ్రహ్మణ్యం, పీకే శేఖర్‌బాబు, నగర మేయర్ ఆర్.ప్రియ, కార్పొరేషన్ కమిషనర్, ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు స్థానిక డీఎంకే నేతలున్నారు.

ఢిల్లీ పర్యటన తర్వాత కొత్త నిర్వాహకులు

● టీఎన్‌సీసీ చీఫ్ వెల్లడి



టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై

అడయార్, ఆగస్టు 5: వచ్చే వారం తాను ఢిల్లీకి వెళ్ళి పార్టీ సీనియర్ నేతలతో పలు అంశాలపై చర్చించనున్నట్టు టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై వెల్లడించారు. ఈ పర్యటన తర్వాత తమిళనాడు కాంగ్రెస్ పార్టీకి కొత్త నిర్వాహకుల నియామకం జరిగే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన తెలిపారు. దక్షిణ చెన్నై పార్టీ పశ్చిమ విభాగం ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శుల సమావేశం సోమవారం అంబత్తూరులో జరిగింది. దీనికి హాజరైన సెల్వపెరుందగై మాట్లాడుతూ, వచ్చే వారం తాను ఢిల్లీ వెళ్ళి పార్టీ సీనియర్ నేతలను కలుసుకుని అనేక అంశాలపై చర్చలు జరుపున్నట్టు తెలిపారు. రాష్ట్రానికి తిరిగి వచ్చిన తర్వాత టీఎన్‌సీసీకి కొత్త నిర్వాహకులను నియమించే విషయంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో గత 50 యేళ్ళుగా కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరంగా ఉందన్నారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు సరైన వ్యక్తులకు బాధ్యతలు అప్పగించాల్సి ఉందన్నారు. అందుకోసమే తాను రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో పార్టీ ఓటు బ్యాంకు పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తాను పార్టీకి చెందిన ఏ ఒక్క నేతను వదులుకోనని చెప్పారు. గత నాలుగు నెలలుగా వివిధ పార్టీలకు చెందిన అనేక మంది నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక్కటే తన సిద్ధాంతాలకు లోబడి ప్రజలకు రక్షణగా ఉందని ఆయన పేర్కొన్నారు. కాగా, జిల్లా కార్యదర్శుల సమావేశంలో ఆ పార్టీకి చెందిన అనేక మంది నేతలు పాల్గొన్నారు.

'లవ్ సింబల్స్' తరహాలో ట్రాఫిక్ సిగ్నల్స్



'హృదయం' ఆకారంలో ట్రాఫిక్ సిగ్నల్ లైట్

అడయార్, ఆగస్టు 5: 'వరల్డ్ ట్రాఫిక్ సిగ్నల్స్ డే'ను పురస్కరించుకుని నగరంలోని ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద వెలిగే లైట్లను లవ్ సింబల్ తరహాలో అమర్చుతున్నారు. ఇవి ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ఆరోగ్యంపై వాహనచోదకుల్లో అవగాహన కల్పించేందుకు వీలుగా నగర ట్రాఫిక్ పోలీసులు ఈ వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. వరల్డ్ ట్రాఫిక్ సిగ్నల్స్ డేను సోమవారం ట్రాఫిక్ పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనచోదకుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేలా ఈ దినోత్సవాన్ని నిర్వహించాలని పోలీస్ కమిషనర్ అరుణ్ ఆదేశించారు. దీంతో ట్రాఫిక్ అదనపు కమిషనర్ సుధాకర్ సారథ్యంలో గ్రేటర్ చెన్నై పోలీస్ పరిధిలోని అన్నాశాలై, కామరాజర్ శాలైతో సహా పలు ప్రధాన రహదారుల్లో ఉన్న ట్రాఫిక్ సిగ్నెల్స్‌లో ఉండే లైట్లను లవ్ సింబల్స్ తరహాలో డిజైన్ చేసి అమర్చారు. ముఖ్యంగా గిండి ట్రాఫిక్ సీఐ విజయలక్ష్మి, ట్రిప్లికేణి ట్రాఫిక్ సీఐ సుబ్రమణియన్ సారథ్యంలో ట్రాఫిక్ పోలీసులు వాహనచోదకులకు అవగాహన కల్పించారు. నగరంలోని ప్రధాన రహదారుల్లో ఉన్న ట్రాఫిక్ సిగ్నెల్ లైట్లు హృదయం ఆకారంలో వెలుగుతూ కనిపించడంతో వాహనచోదకులు సైతం ఆసక్తిగా చూశారు.

27న సీఎం అమెరికా టూర్

ఈ నెల 27వ తేదీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అమెరికా పర్యటనకు వెళ్ళనున్నారు. ఈ పర్యటన 15 రోజుల పాటు సాగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఆయన గూగుల్ సీఈవో సుందర్ పిచ్చాయ్ సహా పలువురు పారిశ్రామిక, పెట్టుబడిదారులను కలుసుకునే అవకాశాలున్నాయని ప్రభుత్వ అధికారులు తెలిపారు.

సమాచార దృష్టి

ఫార్ములా-4 రేస్ టిక్కెట్ల విక్రయం

ఐసిఎఫ్, ఆగస్టు 5: నగరంలో ఈ నెల 31, సెప్టెంబరు 1వ తేదీల్లో నిర్వహించనున్న ఫార్ములా-4 కారు రేస్‌కు సంబంధించిన టిక్కెట్ల విక్రయాలు ప్రారంభమయ్యాయి. దేశంలో తొలిసారిగా జనసంచారం ఉండే వీధుల్లో రాత్రి వేళ పోటీలు నిర్వహించనున్నారు. క్రికెట్ క్రీడాకారులు సౌరవ్ గంగూలి, నటుడు జాన్ అబ్రహం వంటి ప్రముఖులు ఈ పోటీల్లో పాల్గొననుండడంతో ఆ పోటీలు తిలకించేందుకు అభిమానులు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో టిక్కెట్ల విక్రయాలు 'పేటీఎం ఇన్‌సైడర్' యాప్ ద్వారా ఆదివారం ప్రారంభమయ్యాయి. ప్రారంభ టిక్కెట్టు ధర రూ.1,699గా నిర్ణయించారు. టిక్కెట్లు కావాల్సిన వారు https://insider.in/indianracingfestival2024chennaiformularacing-circuit/event అనే లింక్ ద్వారా పొందవచ్చు.

బర్త్ సర్టిఫికెట్‌లో పేరు నమోదుకు అవకాశం

ఐసిఎఫ్, ఆగస్టు 5: జనన ధ్రువీకరణ పత్రాల్లో 15 సంవత్సరాలుగా పేరు చేర్చని వారు ఈ ఏడాది లోపు పేరు నమోదుచేసుకోవాలని బర్త్, డెత్ సర్టిఫికెట్ల రిజిస్ట్రార్ సెల్వవినాయగం తెలిపారు. శిశువు జన్మించిన గానే స్థానిక సంస్థలు, ఆరోగ్య శాఖ ద్వారా జనన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తుంటారు. వాటిలో 15 సంవత్సరాల్లోపు పిల్లల పేర్లు చేర్చాలి. ఇప్పటివరకు పేరు చేర్చని వారు డిసెంబరు 31వ తేదిలోపు పిల్లల పేర్లు చేర్చాలని రిజిస్ట్రార్ ప్రకటన విడుదల చేశారు.

రెండు ప్రభుత్వాస్పత్రులకు వైద్య పరికరాలు

ఐసిఎఫ్, ఆగస్టు 5: నగరంలోని రెండు ప్రభుత్వాసుపత్రులకు రూ.30కోట్ల విలువైన వైద్య ఉపకరణాలను ఇన్ఫోసిస్ సంస్థ అందజేసినట్లు ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. రాజీవ్‌గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రూ.10కోట్లు, ట్రిప్లికేన్‌లోని కస్తూర్బా ఆస్పత్రికి రూ.20కోట్లతో వైద్య పరికరాలను అందజేసింది.

10 నుంచి ఎస్టీలకు శిక్షణా తరగతులు

ఐసిఎఫ్, ఆగస్టు 5: డిగ్రీ టీచర్ అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణా తరగతులు ఈ నెల 10వ తేది నుంచి ప్రారంభం కానున్నాయి. పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా నియమితులయ్యే వారు తప్పనిసరిగా టెట్‌లో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. దీనికోసం ఎస్టీ అభ్యర్థులకు ఈ నెల 10వ తేది నుంచి సేలం, కన్నియాకుమారి, తిరుచ్చి, వేలూరు, ధర్మపురి, నామక్కల్, తిరువణ్ణామలై, కళ్లకుర్చి, కోయంబత్తూర్ జిల్లాల్లో ప్రత్యేక శిక్షణా ఇవ్వనున్నారు.

రాష్ట్రానికి ఒడిశా నేలబొగ్గు సొరంగం

ఐసిఎఫ్, ఆగస్టు 4: ఒడిశాలో 43 కోట్ల టన్నుల నేలబొగ్గు నిల్వలున్న సొరంగాన్ని రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. కేంద్ర ప్రభుత్వం ఒడిశా, చత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాల్లో ఉన్న నేలబొగ్గు గనులు కేటాయించేందుకు ఈ ఏడాది ప్రారంభంలో నిర్వహించిన వేలంలో ఒడిసాలో ఉన్న సహిగోపాల్ నేలబొగ్గు సొరంగానికి సంబంధించి రాష్ట్ర విద్యుత్ బోర్డు పాల్గొంది ఇదివరకు నిర్వహించిన వేలంలో కూడా రాష్ట్రం మాత్రమే పాల్గొనడంతో, ఆ సొరంగాన్ని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించింది.

20 మంది డీఆర్వోల బదిలీ

ఐసిఎఫ్, ఆగస్టు 5: జిల్లా రెవెన్యూ అధికారులు (డీఆర్వో) 20 మందిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా బదిలీ చేశారు. కోయంబత్తూర్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ సెల్వసురభి శివగంగ డీఆర్వోగా, కాంచీపురం డీఆర్వో నారాయణన్ నీలగిరికి బదిలీ అయ్యారు. రాష్ట్ర వైద్య పనుల సంస్థ డీఆర్వో గీత పుదుకోటకు, వాణిజ్య సంస్థ కోవై డీఆర్వో జయచంద్రన్ తెన్‌కాశికి, హిందూ దేవాదాయ శాఖ ఆలయ భూముల ప్రత్యేక అధికారి జానకి చెన్నైకు, చెన్నై సిప్కాట్ జనరల్ మేనేజర్ కార్తికేయన్ తిరుప్పూర్ డీఆర్వోగా బదిలీ అయ్యారు. వీరితో పాటు 20 మంది వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, ఆగస్టు 5: స్థానిక మైలాపూర్, తండయారోపేట ప్రాంతాల్లో విద్యుత్ గ్రీవెన్స్ మంగళవారం ఉదయం 11 గంటలకు జరుగనుంది. వళ్లువర్‌కోట్టం సమీపంలోని ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలో మైలాపూర్ ప్రాంతానికి చెందిన వినియోగదారులు, టీహెచ్ రోడ్డులో ఉన్న ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలో తండయార్‌పేట పరిధికి చెందిన వినియోగదారులు పాల్గొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

కొత్త తాలూకాగా కొళత్తూర్

ఐసిఎఫ్, ఆగస్టు 5: చెన్నై జిల్లాలో కొళత్తూర్ కొత్త తాలూకా ఆవిర్భవించనుంది. ఈ జిల్లాలో 16 తాలూకాలున్న నేపథ్యంలో, అయనావరం తాలూకాను రెండుగా విభజించి కొళత్తూర్ కేంద్రంగా కొళత్తూర్, శిరువల్లూర్, పెరవళ్లూర్ ప్రాంతాలతో ప్రత్యేక తాలూకా ఏర్పాటుచేయనున్నారు. ఇందుకోసం క్షేత్ర పరిశీలన, తాలూకా కార్యాలయం, నిధుల కేటాయింపు, ఉద్యోగుల నియామకం జరుగుతున్నాయి. ఈ నెలాఖరులోగా కొళత్తూర్ తాలూకా ఏర్పాటయ్యేలా రెవెన్యూ శాఖ చర్యలు చేపట్టింది.

రేపు దివ్యాంగుల మౌన ర్యాలీ

ఐసిఎఫ్, ఆగస్టు 5: దివంగత మాజీ ముఖ్యమంత్రి 6వ వర్ధంతి సందర్భంగా నగరంలో బుధవారం దివ్యాంగుల అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో మౌన ర్యాలీ జరుగనుంది. ఈ మేరకు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తంగం విడుదల చేసిన ప్రకటనలో... కరుణానిధి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దివ్యాంగుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి, ఉద్యోగ అవకాశాల్లో 4శాతం రిజర్వేషన్ కల్పించారని, దివ్యాంగుల ఆర్థికసాయం పెంపు, హౌసింగ్ బోర్డు గృహాల కేటాయింపు వంటి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. రాష్ట్ర దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో ఆయన వర్ధంతి రోజైన 7వ తేది ఉదయం 8.30 గంటలకు అన్నాసాలై ఓమందూర్ ప్రభుత్వ ఎస్టేట్ ప్రాంగణంలోని కరుణానిధి విగ్రహానికి నివాళులర్పించి కామరాజర్ రోడ్డులో ఉన్న ఆయన సమాధి వరకు మౌన ర్యాలీ చేపట్టనున్నామని తెలిపారు.

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో సీట్ల కేటాయింపు

ఐసిఎఫ్, ఆగస్టు 5: ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో 12,747 మందికి సీట్లు కేటాయించారు. ఈ కోర్సుల్లో చేరేందుకు జనరల్ కౌన్సెలింగ్ మూడు విడతలుగా జరుగుతోంది. తొలివిడత కౌన్సెలింగ్ గత నెల 29వ తేది ప్రారంభం కాగా 21,408 మంది ఐచ్ఛిక పాఠ్యాంశాలు ఎంపిక చేసుకున్నారు. వారిలో 6,870 మంది తాత్కాలిక కేటాయింపు, 10,890 మంది తుది కేటాయింపు ఉత్తర్వులు పొందారు. ఇదే విధంగా, 7.5 శాతం రిజర్వేషన్‌లో 1,406 మందిని ఆహ్వానించగా, వారిలో 1,250 మంది ఐచ్ఛిక పాఠ్యాంశాలు ఎంపిక చేసుకున్నారు. వారిలో 835 మంది తుది కేటాయింపు, 293 మంది తాత్కాలిక కేటాయింపు ఉత్తర్వులు పొందారు. వృత్తి విద్య విభాగాలకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 889 మందికి తుది కేటాయింపులు, 165 మంది తాత్కాలిక కేటాయింపు ఉత్తర్వులు పొందారు.

తీరప్రాంతాల్లో పోలీసుల గస్తీ

పెరంబూర్, ఆగస్టు 5: రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో నైరుతి రుతుపవనాల ప్రభావంతో భారీవర్షాలు కురుస్తున్నాయి. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఈ నెల 7వ తేది వరకు సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలలు ఎగసి పడే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఈ నేపథ్యంలో, కన్నియాకుమారి జిల్లాల్లో సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో జాలర్లు సముద్రంలో వేటకు వెళ్లరాదని కలెక్టర్ అళగుమీనా ఉత్తర్వులు జారీచేశారు. తీర ప్రాంతాల్లో 35 నుంచి 45 కి.మీ, కొన్ని సమయాల్లో 55 కి.మీ వేగంతో గాలులు వీసే అవకాశముందని, అందువల్ల ప్రజలు తీరప్రాంతాలకు వెళ్లరాదని కలెక్టర్ హెచ్చరించారు. తీరప్రాంతాలకు ప్రజలు రాకుండా జిల్లాల్లో పర్యాటకులు అధికంగా వెళ్లే బీచ్‌ల వద్ద పోలీసు భద్రత ఏర్పాటుచేశారు.



లేమూరు బీచ్‌లో గస్తీ పనుల్లో పోలీసులు

తమిళనాడు సైన్స్ సమాఖ్య జిల్లా నిర్వాహకుల సమావేశం



సమాఖ్య కార్యక్రమాలతో కూడిన పుస్తకం ఆవిష్కరిస్తున్న జనార్ధనన్

వేలూరు, ఆగస్టు 5: తమిళనాడు సైన్స్ సమాఖ్య జిల్లా నిర్వాహకుల సమావేశం చెల్లియప్ప భవనంలో జరిగింది. సమావేశానికి ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు అముద అధ్యక్షత వహించారు. ముందుగా జిల్లా సెక్రటరీ జనార్ధనన్ మాట్లాడారు. మాజీ రాష్ట్ర కోశాధికారి సెంథమిల్ సెల్వన్ సంఘ కార్యకలాపాలు, శిక్షణ వివరించారు. సమావేశంలో ఉపాధ్యక్షులు గాయత్రి, జాయింట్ సెక్రటరీ రవీంద్రన్, భాస్కరన్ పాల్గొన్నారు. అనంతరం విద్య, ఆరోగ్యం, సైన్స్ ప్రచార విభాగం, పొల్యూషన్, అభివృద్ధి తదతర ఉప గ్రూపులను ఎంపిక చేశారు. జిల్లా పనుల వివరాలను జనార్ధనన్ వెలువరించగా జిల్లా అధ్యక్షులు అముద, ముత్తు, శిలుపన్, సెంథమిల్‌సెల్వన్ అందుకున్నారు. సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించినట్లు నిర్వాహకులు తెలిపారు.

జోరుగా ఫింగర్ కవర్స్ తయారీ



పెరంబూర్, ఆగస్టు 5: మొబైల్ ఫోన్లలో గేమ్స్ ఆడుకొనేందుకు వీలుగా బొటన వేళ్లకు వేసుకొనేలా ఫింగర్ కవర్స్ తయారీ తిరుప్పూర్‌లో జోరుగా సాగుతోంది. రెడీమేడ్ దుస్తుల తయారీకి పేరుగాంచిన తిరుప్పూర్‌లో కరోనా కాలంలో మాస్కులు, గ్లౌజులు, ఫుల్ బాడీ సూట్ తదితరాలు తయారుచేశారు. ద్విచక్రవాహనాల్లో దూరప్రాంతాలకు వెళ్లేవారు, పారిశుధ్య కార్మికులు, కర్మాగారాల్లో చేతులలో పనిచేసే వారు వస్త్రంతో చేసిన గ్లౌజ్ వినియోగిస్తుంటారు. ఈ గ్లౌజ్‌లను కూడా తిరుప్పూర్‌లో తయారవుతున్నాయి. తాజాగా, ఫింగర్ కవర్లు తయారు చేస్తుండగా, వాటి విక్రయాలు కూడా జోరుగా కొనసాగుతున్నాయి. మొబైల్‌లో గేమ్ ఆడే యువకులు, చిన్నపిల్లలు టచ్ స్ర్కీన్‌లో బొటన వేళ్ల ద్వారా ఆడాల్సి ఉంటుంది. గేమ్ ఎక్కువసేపు ఆడాల్సి రావడంతో చెమటతో మొబైల్ మొరాయించే పరిస్థితులున్నాయి. ఈ సమస్యకు చెక్ పెట్టేలా ప్రస్తుతం యువకులు, పిల్లలు ఫింగర్ కవర్లు అధికంగా వినియోగిస్తున్నారు. ఈ కవర్లకు డిమాండ్ పెరగడంతో తిరుప్పూర్‌లో ప్రస్తుతం వీటి తయారీ ముమ్మరంగా సాగుతోంది.

నకిలీ బార్‌లో పోలీసుల తనిఖీలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు

వేలూరు, ఆగస్టు 5: గుడియాత్తం 35వ వార్డు సముద్రం శ్రీవారి నగర్‌లో టాస్మాక్ దుకాణం ఉంది. దాని సమీపంలో అనుమతి లేకుండా బార్ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో, డీఎస్పీ రవీంద్రన్ నేతృత్వంలో సీఐ పార్థసారథి, పోలీసులు సోమవారం మధ్యాహ్నం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ సమయంలో కొందరు అక్కడ కూర్చుని మద్యం సేవిస్తుండడంతో, అక్కడే సైడ్ డిష్ విక్రయాలు చేస్తుండడాన్ని గమనించి, మద్యం సేవిస్తున్న వారిని అక్కడి నుంచి వెళ్లగొట్టారు. ఆ ప్రాంతంలో సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో... పిచ్చన్‌పేటకు చెందిన రమేష్, మనోహరన్ అనుమతి లేకుండా బార్ నిర్వహిస్తున్నట్లు తెలియడంతో వారి కోసం గాలిస్తున్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

వేలూరు, ఆగస్టు 5: స్థానిక సత్తువాచేరి సమీపం వళ్లలార్‌లో సోమవారం ది వేలూరు ఆర్థో ఫౌండేషన్ ఆస్పత్రి, రోటరీ క్లబ్ ఆఫ్ వేలూరు పాలార్ సిటీ ఆధ్వర్యంలో ఆర్థో వైద్యశిబిరం జరిగింది. ఈ వైద్య శిబిరాన్ని డా.తంగమణి ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు వెంకటేశన్, సెక్రటరీ రమేష్, కోశాధికారి కార్తికేయన్, మాజీ రోటరీ అధ్యక్షుడు డా.మోహనరాజ్, ఇళంగోవన్, మాసిలామని, రవికుమార్, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

మూడు టన్నుల వ్యర్థాలు తొలగింపు



చెత్త తొలగింపు పనుల్లో అధికారులు, కార్మికులు

వేలూరు, ఆగస్టు 5: జిల్లా కలెక్టర్ ఉత్తర్వులతో, కార్పొరేషన్ కమిషనర్ సలహాతో కార్పొరేషన్ 1వ మండల పారిశుధ్య అధికారి శివకుమార్ నేతృత్వంలో 15వ వార్డులో సోమవారం ఫాగింగ్ చేశారు. అలాగే, ఖాళీ ప్లేట్లు, వర్షపు నీటిలో ఉన్న గాజు సీసాలు, ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ పార్శల్ డబ్బాలు, కొబ్బరి చిప్పలు, టైర్లు తదితరాలు తొలగించారు. డెంగ్యూ వ్యాప్తి నిరోధక చర్యల్లో భాగంగా డీపీసీ ఉద్యోగులు 75 మంది, శుభ్రతా ఉద్యోగులు 75 మంది, శుభ్రతా ఇన్‌స్పెక్టర్, సూపర్‌వైజర్లు, యానిమేటర్లు 175 మంది పాల్గొన్నారు.

పెంచిన లే అవుట్ ఫీజులు తగ్గించాలి

అడయార్, ఆగస్టు 5: లే అవుట్ ప్లాన్ అప్రూవల్ కోసం చెల్లించే ఫీజును భారీగా పెంచడాన్ని పలు రాజకీయ పార్టీల నేతలు ఖండించారు. గతంలో 1000 చదరపుటడుగుల ప్లాన్‌కు రూ.40 వేలు వసూలు చేస్తుండగా, ఇపుడు ఈ మొత్తాన్ని లక్ష రూపాయలకు పెంచడాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై, మాజీ ముఖ్యమంత్రి ఓ పన్నీర్‌సెల్వం, పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ ఖండించారు. ఈ పెంచిన ఫీజును తక్షణం తగ్గించాలని కోరుతూ వారు వేర్వేరుగా విడుదల చేసిన పత్రికా ప్రకటనలో డిమాండ్ చేశారు.

జీసీసీ వాహనాలకు జీపీఎస్ పరికరం

పెరంబూర్, ఆగస్టు 5: గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) వాహనాలకు జీపీఎస్ పరికరం అమర్చాలని కమిషనర్ కుమరగురుపన్ ఉత్తర్వులు జారీచేశారు. జీసీసీలో చెత్త సేకరణతో పాటు పలురకాల పనులకు 2,886 వాహనాలు వినియోగిస్తున్నారు. ఈ వాహనాలకు సంబంధించిన డ్రైవర్లు విధుల్లో ఉన్నట్లు సంతకం చేసి, స్వంత పనులను వెళ్లడం, రోడ్డు పక్కన వాహనాలు నిలిపి నిద్రించడం వంటివి చేస్తుండడంతో నగరంలో పారిశుధ్య పనులు స్తంభించాయని జీసీసీ కమిషనర్ ఇటీవల చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో వెల్లడైంది. దీనిపై స్పందించిన కమిషనర్, జీసీసీ పరిధిలోని అన్ని రకాల వాహనాలకు జీపీఎస్ పరికరం ఏర్పాటుచేయాలని ఉత్తర్వులు జారీచేశారు.

రాష్ట్రంలోని డ్యాంలలో 174 టీఎంసీల నీటినిల్వలు

ప్యారీస్, ఆగస్టు 5: రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ద్వారా గత ఏడాది కంటే రెండింతలు అధికంగా కురిసిన వర్షంతో డ్యాంలలో నీటిమట్టాలు పెరిగాయి. ప్రజాపనుల శాఖ అధికారుల సర్వే ప్రకారం 174 టీఎంసీల నీరు డ్యాంలలో నిల్వ ఉన్నట్లు తెలిసింది. రాష్ట్రంలో ఉన్న ఆనకట్టల పూర్తి సామర్థ్యం 224.297 టీఎంసీలు కాగా, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల నీటిమట్టాలు పెరుగుతున్నాయి. ఆదివారం సాయంత్రం వరకు 174.579 టీఎంసీల నీరుందని, అందువల్ల తాగు, సాగు నీటికి మరో మూడు నెలలు ఎలాంటి కొరత ఉండదని అధికారులు తెలిపారు. సేలం జిల్లా మేట్టూరు డ్యాంలో 93.47 టీఎంసీలు, భవానీ సాగర్‌లో 24.77 టీఎంసీలు, అమరావతిలో 1.94 టీఎంసీలు, వైగై డ్యాంలో 2.96 టీఎంసీలు పాపనాశంలో 4.13 టీఎంసీలు, మణిముత్తారు డ్యాంలో 1.57 టీఎంసీలు నీటినిల్వలున్నాయి. ఇదిలా ఉండగా, రాజధాని నగరంలోని ప్రజలకు తాగు నీటి అవసరాలు తీరుస్తున్న పూండి, చోళవరం, పుళల్, కన్నన్‌కోట తేర్వాయ్ కండిగ, చెంబరంబాక్కం, వీరాణం చెరువుల్లో కూడా నీటిమట్టాలు పెరిగాయి.

శాంతివనంగా రాష్ట్రం

● న్యాయ శాఖ మంత్రి రఘుపతి

ప్యారీస్, ఆగస్టు 5: డీఎంకే పాలనలో శాంతి భద్రతలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా రాష్ట్రం శాంతివనంగా ఉందని న్యాయశాఖ మంత్రి రఘుపతి పేర్కొన్నారు. పుదుకోట జిల్లా కడైకుడి పంచాయతీ పరిధిలోని పెరుంగుడి ప్రాంతంలో రాష్ట్రప్రభుత్వం తరఫున నిర్మించాలనుకున్న సమత్తువపురం శంకుస్థాపన సోమవారం ఉదయం జరిగింది. ముఖ్యఅతిథిగా మంత్రి రఘుపతి పాల్గొని మీడియాతో మాట్లాడారు. దేశంలోనే ఒక్క తమిళనాడు మాత్రమే శాంతివనంగా ఉందని, అయితే విపక్షాలు పనిగట్టుకొని ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నాలు చేపట్టాయని మంత్రి తెలిపారు.

ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసు...

ఐదుగురికి 7 రోజుల పోలీస్ కస్టడీ

పెరంబూర్, ఆగస్టు 5: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసు ముద్దాయిలు ఐదుగురిని పోలీసు కస్టడీకి అనుమతిస్తూ ఎగ్మూర్ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. పూందమల్లి జైలులో ఉన్న పొన్నై బాలు, అరుళ్, రాము, హరిధరన్, శివశక్తిలను విచారణ నిమిత్తం ఏడు రోజులు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ న్యాయమూర్తి జగదీశన్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

ఆస్పత్రిలో ఖైదీ పుట్టినరోజు వేడుకలు

● ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

ప్యారీస్, ఆగస్టు 5: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఓ ఖైదీ కడలూరు ప్రభుత్వాస్పత్రిలో తన భార్యతో కలసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న వ్యవహారంలో బందోబస్తులో ఉన్న ఇద్దరు పోలీసులను ఎస్పీ రాజారామ్ సస్పెండ్ చేశారు. కడలూరు సమీపంలో ఉన్న బిల్లాలితొట్టి ప్రాంతానికి చెందిన సూర్య (26) అనే రౌడీ కొన్ని రోజుల క్రితం గంజా మత్తులో డీఎంకే నాయకుడు సహా ప్రజలను కత్తితో బెదిరించి హల్ చల్ చేసాడు. దీంతో కొందరు అతడిని పట్టుకొనే సమయంలో వారికి అందకుండా పరుగెత్తిన సూర్య, కింద పడడంతో కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. అతడిని కడలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 1న సూర్య పుట్టినరోజు కావడంతో ఆస్పత్రిలో మంచంపై ఆయన తన భార్య సమక్షంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. ఈ ఘటనపై ఆగ్రహం చెందిన ఎస్పీ, ఆ సమయంలో సూర్య దగ్గర బందోబస్తులో ఉన్న ఇద్దరు పోలీసులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఈత శిక్షణలో విషాదం : పదేళ్ల బాలుడి మృతి

అడయార్, ఆగస్టు 5: స్థానిక కొళత్తూరులో విషాదం చోటు చేసుకుంది. ఈత నేర్చుకుంటూ పదేళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని కీర్తి సబరీస్కర్(10)గా గుర్తించారు. కొళత్తూరు, వినాయకుపురానికి చెందిన ఫాలేకర్ కుమారుడైన కీర్తి బాల్యం నుంచే మానసిక పరిపక్వత లేమితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆ బాలుడిని వైద్యులకు చూపించగా, ఈతలో శిక్షణ ఇప్పించాలని సలహా ఇచ్చారు. వైద్యులు చెప్పినట్టుగానే ప్రతిరోజూ బాలుడి తల్లి రాణి స్థానికంగా ఉండే ఒక శిక్షణా కేంద్రానికి తీసుకెళ్ళేది. ఈ క్రమంలో ఆదివారం కూడా తీసుకెళ్ళింది. కొంతసేపటికి ఆ బాలుడు నీటమునిగి అపస్మారకస్థితిలోకి జారుకున్నాడు. ఆ వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించగా కీర్తి మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. ఈత కొలను యజమాని గాడ్విన్, ట్రైనర్ అభిలాష్‌లను అరెస్టు చేశారు.

మదురైలో రోడ్డు ప్రమాదం

● ముగ్గురు ఎండీఎంకే నేతల దుర్మరణం

అడయార్, ఆగస్టు 5: మదురైలో లారీ, కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు ఎండీఎంకే నేతలు దుర్మరణం పాలయ్యారు. మృతులను పచ్చముత్తు (50), అమృతరాజజ్ (37), పులిశేఖర్ (35)గా గుర్తించారు. ఎగ్మోర్‌లోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎండీఎంకే 30వ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. పార్టీ ప్రధాన కార్యదర్శి వైగో, ముఖ్య కార్యదర్శి దురై వైగోతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సమావేశానికి హాజరైన పచ్చముత్తు, అమృతరాజ్, పులిశేఖర్ సమావేశం తర్వాత తిరిగి సొంతూరుకు బయలుదేరారు. వీరి కారు మదురై జిల్లా మేలూరు సమీపంలోని టోల్‌గేట్ వద్ద వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ప్రభాకర్ అనే నేత గాయపడగా, సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

కుమార్తెతో వ్యభిచారం

● తల్లి సహా ఆరుగురి అరెస్టు

అడయార్, ఆగస్టు 5: స్థానిక వ్యాసార్‌పాడిలో తన 16 యేళ్ళ కుమార్తెతో బలవంతంగా వ్యభిచారం చేయించిన తల్లిని నగర పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. వ్యాసార్‌పాడిలో ఓ ప్రాంతానికి చెందిన మహిళ భర్తకు దూరంగా తన 16 యేళ్ళ కుమార్తెతో ఉంటుంది. అయితే, తన వ్యక్తిగత ఖర్చుల కోసం స్థానికంగా ఉండే ముత్తులక్ష్మి అనే మహిళ దగ్గర రూ.40 వేల రుణం తీసుకుంది. ఈ రుణాన్ని తిరిగి చెల్లించలేకపోయింది. దీంతో ముత్తులక్ష్మికి 16 యేళ్ళ యువతిపై కన్నుపడింది. ఆ బాలికను తన దగ్గరకు పంపించాలని కోరడంతో ఆ మహిళ అలాగే చేసింది. ఆ తర్వాత ఆ బాలికతో ముత్తులక్ష్మి బలవంతంగా వ్యభిచారం చేయించడంతో బాలిక ఎంకేబీ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు ముత్తులక్ష్మితో పాటు బాలిక తల్లిని, ముత్తులక్ష్మి భర్త నిషాంత్, బంధువైన పులియంతోపుకు చెందిన అజిత్ కుమార్, బాలికతో సన్నిహితంగా మెలిగిన వ్యాసార్పాడికి చెందిన కిషోర్, కావాంగరైకు చెందిన మహేశ్వరన్ అనే వారిని పోలీసులు అరెస్టు చేశారు.


రాష్ట్ర రవాణా శాఖలో సీఎన్‌జీ బస్సులు

ప్యారీస్, ఆగస్టు 5: రాష్ట్ర రవాణా శాఖ ఇంధనం పొదుపు, పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించింది. సీఎన్‌జీతో బస్సులు నడిపే పథకంలో భాగంగా సోమవారం సేలం డివిజన్‌లో కొత్తగా డిజైన్ చేసిన బస్సులను ప్రయోగాత్మకంగా నడిపింది. ఇంధనంతో నడిపే బస్సుల కంటే అదనంగా రెండు కి.మీ మైలేజీ రావడంతో సీఎన్‌జీ బస్సులను రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు కూడా విస్తరింపజేయనున్నట్లు ప్రకటించింది. చెన్నై, విల్లుపురం, సేలం, కుంభకోణం, కోవై, మదురై, తిరునల్వేలి రవాణా శాఖ డివిజన్లలో తొలివిడతగా 20 బస్సులను నడుపనుంది. సీఎన్‌జీ ద్వారా 6.5 నుంచి 7.5 కి.మీ వరకు బస్సు నడపడం వల్ల సీఎన్‌జీ కిలో రూ.79.50 ఖర్చవుతుందని, ఇందువల్ల 30 శాతానికి పైగా ఇంధనం ఖర్చు ఆదా అవుతుందని అధికారులు తెలిపారు.

కరూర్, నామక్కల్‌లో సీబీసీఐడీ సోదాలు

పెరంబూర్, ఆగస్టు 5: నామక్కల్ గణేశపురంలోని రియల్ ఎస్టేట్ యజమాని బాలుకు చెందిన ఇంట్లో కరూర్, నామక్కల్ సీబీసీబీఐ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. కరూర్‌లో అన్నాడీఎంకే మాజీ మంత్రి ఎమ్మార్ విజయభాస్కర్ భూ కబ్జా కేసు వ్యవహారానికి సంబంధించి ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ ఇంట్లో వేరే వ్యక్తి నివసిస్తున్నారు.

పాంబన్ కొత్త వంతెనపై రైలింజన్‌తో ట్రయల్ రన్



ఐసిఎఫ్, ఆగస్టు 5: రామనాథపురం జిల్లా రామేశ్వరం సమీపంలో ఉన్న పాంబన్ కొత్త రైల్వే వంతెనపై ఆదివారం రాత్రి రైలింజన్‌తో ట్రయల్ రన్ నిర్వహించారు. 1914లో అందుబాటులోకి వచ్చిన పాంబన్ రైల్వే బ్రిడ్జి మధ్యలో ఉన్న లిఫ్ట్ వంతెన పటిష్టత కోల్పోవడంతో 2020 జనవరిలో కొత్త వంతెన నిర్మాణపనులు రూ.550 కోట్లతో ప్రారంభమయ్యాయి. మొత్తం 2.1 కి.మీ మేర కొత్త వంతెన మధ్య లిఫ్ట్ ఏర్పాటుపనులు జూలై 27న పూర్తయ్యాయి. శనివారం ఈ వంతెనను సాంకేతిక నిపుణులు తనిఖీ చేశారు. అనంతరం ఆదివారం రాత్రి 7.10 గంటలకు తొలిసారిగా రైలింజన్ ట్రయల్ రన్ నిర్వహించారు. అక్టోబరు 1 నుంచి రామేశ్వరానికి రైళ్ల సేవలు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

త్వరలో సేలం మినీ టైడల్ పార్క్ ప్రారంభం

ఐసిఎఫ్, ఆగస్టు 5: సేలంలో ఏర్పాటైన మినీ టైడర్ పార్క్ త్వరలో ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటైన సేలంకు వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాలనుంచి ఉపాధి కోసం నిరుద్యోగులు వస్తున్నారు. ఇదిలాఉండగా, సేలం, చుట్టుపక్కల జిల్లాల్లో వందలాది ఇంజనీరింగ్, ఆర్ట్స్ కళాశాలలున్నాయి. ప్రతి ఏటా లక్షల మంది విద్యార్థులు డిగ్రీ పూర్తిచేసుకొని వారి అర్హత బట్టి ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని 8 నెలల క్రితం మినీ టైడల్ పార్క్ నిర్మాణపనులు చేపట్టారు. సేలం-బెంగుళూరు జాతీయ రహదారిలో కరుపూర్‌లో 15 ఎకరాల్లో ఏర్పాటైన ఈ టైడల్ పార్క్ నిర్మాణం పూర్తికావడంతో త్వరలో ప్రారంభించనున్నామని అధికారులు తెలిపారు.

నియోజకవర్గాల వివరాలతో కొత్త క్యాలెండర్

ఐసిఎఫ్, ఆగస్టు 5: ఆడిపెరుక్కు సందర్భంగా శివకాశిలో 2025 సంవత్సరం క్యాలెండర్ ఆల్బమ్ విడుదల చేశారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే రాష్ట్ర శాసనసభ నియోజకవర్గాల వివరాలు తెలుసుకొనేలా కొత్త మోడళ్లు ఈసారి పరిచయం చేయనున్నారు. విరుదునగర్ జిల్లా శివకాశిలో 200లకు పైగా ప్రెస్‌ల్లో క్యాలెండర్ తయారీ జరుగుతోంది.వీటి తయారీ ద్వారా ఏడాదికి రూ.200 కోట్ల మేర వ్యాపారం జరుగుతోంది.ఆడిపెరుక్కును పురస్కరించుకొని కొత్త క్యాలెండర్ ఆల్బమ్ విడుదల చేశారు. ఈ కొత్త క్యాలెండర్ పనులు నాలుగు నెలల్లో పూర్తికానున్నాయి. ఈసారి ప్రత్యేకతగా 234 నియోజకవర్గాల ప్రత్యేక అంశాలు తెలుసుకొనే డైలీ క్యాలెండర్ పరిచయం చేయనున్నారు. ఆర్ట్ పేపర్ ధర పెంపు, విద్యుత్ చార్జీలు, కూలీల వేతనాల పెంపు కారణంగా క్యాలెండర్ ధరలు 10 శాతం పెంచనున్నట్లు విక్రయదారులు తెలిపారు.

9వ శతాబ్దం నాటి విగ్రహం లభ్యం



లభ్యమైన విష్ణుమూర్తి విగ్రహం

ఐసిఎఫ్, ఆగస్టు 5: తిరువెన్నైనల్లూర్ సమీపంలోని తడుత్తకొండూరులో విల్లుపురానికి చెందిన చరిత్ర పరిశోధకుల బృందం పరిశోధనల్లో పల్లవుల కాలం నాటి 9వ శతాబ్దానికి చెందిన విష్ణుమూర్తి విగ్రహం లభ్యమైంది. వీరప్పన్‌మేడు అనే ప్రాంతం లో ఐదడుగుల ఎత్తుతో నాలుగు చేతులు కలిగిన విష్ణు విగ్రహం, గ్రామదేవత ఎల్లైబిడారి అమ్మవారు, సప్తమాధర విగ్రహాలను కనుగొన్నారు. శంఖు చక్రాలతో అభయ ముద్రలో ఉన్న విష్ణుమూర్తి విగ్రహం క్రీ.శ 9వ శతాబ్దానికి చెందిన పల్లవుల కాలం నాటిదని గుర్తించారు. వెయ్యేళ్లక్రితం ఈ గ్రామంలో విష్ణుమూర్తి ఆలయం ఉండి ఉంటుందని పరిశోధకులు తెలియజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, ఆగస్టు 5: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

టి.నగర్: వెస్ట్ మాంబళం నరసింహ వీధి, ఏరికరై రోడ్డు, వెంకటాచలం వీధి, సత్యపురి వీధి, ఆంజనేయర్ వీధి, రాజా వీధి, మాణిక్యం వీధి, తంబయ్య రోడ్డు, రాజగోపాలన్ వీధి, వేలు వీధి, వీరాస్వామి వీధి, గిరి వీధి, లక్ష్మీనారాయణన్ వీధి, ఉమాపతివీధి, గణపతి వీధి, చక్రపాణి వీధి, శ్యామల అవధాన వీధి, మారియమ్మన్ ఆలయ వీధి, జేపీ వీధి, అప్పాస్వామి వీధి, ధనశేఖరన్ వీధి, ఆర్కే గౌడ వీధి, పీవీ వీధి, నక్కీరన్ వీధి, వెస్ట్ మాంబళం, ఈశ్వరన్ ఆలయ వీధి, అప్పారెడ్డి వీధి, కాశీవిశ్వనాథ ఆలయ వీధి, పటేల్ వీధి, సత్యనారాయణ వీధి, కామకోటి కాలనీ, రామకృష్ణా పురం 1,2,3 వీధులు, ఎల్లయమ్మన్ ఆలయ వీధి, జ్యోతిలింగం వీధి, శ్రీనివాస అయ్యంగార్ వీధి, ముత్తాలమ్మన్ ఆలయ వీధి, బాబూ ప్రసాద్ 1,2 వీధులు, కృష్ణమూర్తి 48వ వీధి, పడవేట్టమ్మన్ ఆలయ వీధి, దేవనాథన్ కాలని, వండికారన్ వీధి, వడివేల్ పురం

కేకే నగర్: ట్రస్ట్ పురం, ఇన్బరాజ పురం, కోడంబాక్కం, వరదరాజపేట మెయిన్ రోడ్డు, రంగరాజపురం, కామరాజర్ నగర్, అజీస్ నగర్, చూలైమేడు, ఆత్రేయపురం వీధులు, గిల్ నగర్ ఎక్స్‌టెన్షన్, వడపళని ఆండవర్ నగర్, అశోక్ నగర్, సుబ్బరాయన్ 1 నుంచి 8 వీధులు, కామరాజర్ కాలనీ 1 నుంచి 8 వీధులు, అళగిరి రోడ్డు, సాలిగ్రామం 100 అడుగుల రోడ్డు

తిరువాన్మియూర్: కామరాజర్ నగర్ వెస్ట్ అవెన్యూ, ఎల్బీ రోడ్డు, ఆవిన్ నగర్ మెయిన్ రోడ్డు, భారతి నగర్

షోలింగనల్లూర్: చిట్లపాక్కం, జయా నగర్, వళ్లువర్ నగర్, మాంబాక్కం మెయిన్ రోడ్డు, టీవీ నగర్, మహేశ్వరి నగర్, టీఎన్‌హెచ్‌బీ కాలని


మేడవాక్కం: రాయల్ గార్డెన్, ఐశ్వర్య నగర్, ఆర్పీ నగర్, పిల్లయార్ ఆలయ వీధి, ట్యాంక్ బండ్ వీధి, నెసవాలర్ నగర్ అన్నాసాలై, గౌరివాక్కం, విజయనగరం, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, బాలాజీ నగర్, గోపాలపురం, ఆదినాథ్ అవెన్యూ, మాడంబాక్కం, కోవిలంజేరి, నూట్రన్‌జేరి

అన్నానగర్: శాంతికాలనీ, పాత ఎల్, వై, జెడ్ బ్లాక్‌లు, శాంతి కాలని 7వ మెయిన్ రోడ్డు, టీఎన్‌హెచ్‌బీ కాలనీ, షెనాయ్ నగర్ వెస్ట్ 1 నుంచి 8 క్రాస్ వీధులు, పెరియార్ రోడ్డు, కదిరవన్ కాలని, గజలక్ష్మి కాలని, భారతిపురం

అమింజికరై: పీపీ గార్డెన్, ఎంఎం కాలని, ఎన్‌ఎస్కే నగర్, స్కైవాక్, ఎన్‌ఎం రోడ్డు

అంబత్తూర్: భాగ్యమ్మాళ్ నగర్, పెరియార్ మెయిన్ రోడ్డు, ఒలింపిక్ కాలని, అక్షయ కాలని, కామరాజర్ వీధి, టీవీఎస్ కాలని, టీవీఎస్ అవెన్యూ, ఎల్‌ఐసీ కాలని, చెన్నై పబ్లిక్ స్కూల్ రోడ్డు

డెంగ్యూ బాధితులకు కలెక్టర్ పరామర్శ



సీఎంసీ కాలనీలో బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఆగస్టు 5: కార్పొరేషన్ పరిధిలోని మూడో మండలం 57వ వార్డు సీఎంసీ కాలనీలో డెంగ్యూ లక్షణాలతో బాధపడుతున్నారు. సోమవారం ఉదయం కలెక్టర్ సుబ్బులక్ష్మి ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించి, బాధితులతో మాట్లాడి, మందులు వేసుకోవాలని, ఇళ్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట కార్పొరేషన్ కమిషనర్ జానకి, కార్పొరేషన్ సంక్షేమ అధికారి గణేష్, ఆరోగ్య శాఖ ఇన్‌స్పెక్టర్లు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ముత్తురంగం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీధరన్



వేలూరు, ఆగస్టు 5: స్థానిక ముత్తురంగం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీధరన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో అరియలూరు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పనిచేస్తూ బదిలీపై ముత్తురంగం కళాశాలకు వచ్చారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్‌ను అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు. కాగా, శ్రీధరన్ గతంలో ఇదే కళాశాలలో ఉపాధ్యక్షుడుగా పనిచేశారు.



అలా పిలవడం అవమానంగావుంది

● మంజూ వారియర్

తనను అందరూ లేడీ సూపర్‌స్టార్ అని పిలుస్తుంటే వ్యక్తిగతంగా అవమానంగా ఉందని బాలీవుడ్ నటి మంజూ వారియర్ అన్నారు. టీఎస్ జ్ఞానవేల్ దర్శకత్వంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'వేట్టైయన్' మూవీలో హీరో భార్యగా నటించినట్టు ఆమె తాజాగా వెల్లడించారు. బడా నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్ నిర్మించే ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం. అమితాబ్, ఫహద్ ఫాజిల్, రానాలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మంజూ వారియర్, రితికా సింగ్, తుషార విజయన్ హీరోయిన్లు. వీరిలో రజనీకాంత్ భార్యగా మంజూ వారియర్ నటిస్తున్నారు. ఈ విషయంపై ఆమె స్పందిస్తూ, 'ఇది ఫుల్ అండ్ ఫుల్ రజనీకాంత్ సినిమా. ఇందులో ఆయన భార్య పాత్ర పోషించాను. షూటింగ్ పూర్తయింది. నా పాత్రకు డబ్బింగ్ కూడా మొదలుపెట్టాను. నన్ను అందరూ లేడీ సూపర్‌స్టార్ అంటున్నారు. ఈ మాట వింటుంటే నాకు వ్యక్తిగతంగా అవమానంగా ఉంది. నన్ను అలా సంబోధించడం వల్ల సోషల్ మీడియాలో అనవసర చర్చ, వివాదానికి దారితీస్తుంది. నాకు అలాంటి ట్యాగులు వద్దు. ప్రేక్షకుల ప్రేమ, ఆదరాభిమానాలు ఉంటే చాలు' అని పేర్కొన్నారు.

మోహన్ దర్శకత్వంలో రిచర్డ్ రిషి

2020లో వచ్చిన 'ద్రౌపది' సినిమాతో యావత్ తమిళ చిత్రపరిశ్రమను తనవైపు చూసేలా చేసిన దర్శకుడు మోహన్ జి క్షత్రియన్. ఈ సినిమా కంటే ముందు 2016లో వచ్చిన 'పళయ వణ్ణారపేట' సినిమాతో దర్శకుడిగా పరిచయమయ్యారు. ఇపుడు తన మూడో ప్రాజెక్టును అధికారికంగా ప్రకటించారు. ఇందులో రిచర్డ్ రిషి ప్రధాన పాత్ర పోషించనున్నారు. గతంతో మోహన్ తెరకెక్కించిన 'ద్రౌపది'తో పాటు 'రుద్రతాండవం' సినిమాల్లో రిచర్డ్ రిషి నటించిన విషయం తెల్సిందే. ఇపుడు మరోమారు దర్శకుడు మోహన్‌తో కలిసి పనిచేయనున్నారు. ఈ విషయాన్ని మోహన్ తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. 'ఈ రోజు మంచి రోజు ఆడి పెరుక్కు. ఈ శుభతరుణాన్ని పురస్కరించుకుని కొత్త ఆఫీసులో పూజా కార్యక్రమంతో తదుపరి ప్రాజెక్టుకు సంబంధించిన పనులు ప్రారంభించాం. ఈ విషయాన్ని సంతోషంతో తెలిజయేస్తున్నాను. ఎప్పటిలాగే మీ ప్రేమ, మద్దతు కోసం ఎదురు చూస్తున్నాను' అని పేర్కొన్నారు.



పూజా కార్యక్రమంలో రిచర్డ్, మోహన్

చిత్రజ్యోతి

రెండు భాషల్లో రాణిస్తున్న కెమెరామాన్ ప్రసన్న కుమార్



విజయ్ ఆంటోనీ హీరోగా వచ్చిన 'పిచ్చైకారన్' ద్వారా కెమెరామాన్‌గా కోలీవుడ్‌కు పరిచయమైన ప్రసన్న కుమార్ ఇపుడు తమిళం, తెలుగు భాషల్లో వరుస అవకాశాలను దక్కించుకుంటూ తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. ప్రతి సినిమాకు ప్రతిభను మెరుగుపరుచుకుంటూ వరుస అవకాశాలు చేజిక్కించుకుంటున్నారు. నిరంతరం విభిన్నమైన కథాంశాలతో తెరకెక్కుతున్న చిత్రాలకు పనిచేస్తూ, తన కెమెరా పనితనాన్ని చూపిస్తూ ప్రతి ఒక్కరి ప్రశంసలు పొందుతున్నారు. ఇటీవల జీ5లో విడుదలైన 'బహిష్కరణ' అనే సిరీస్‌ను పీరియాడిక్ కలర్ టోన్‌లో అద్భుతంగా తమ కెమెరాలో బంధించారు. రాధా మోహన్ - యోగిబాబు కాంబినేషన్‌లో తెరకెక్కిన 'చట్నీ సాంబార్' వెబ్ సిరీస్‌లో కుటుంబ సంబంధాలను అద్భుతంగా చిత్రీకరించారు. ఈ విషయంపై ప్రసన్న మాట్లాడుతూ, 'విభిన్నమైన కథాంశాల్లో తెరకెక్కించే చిత్రాలకు పనిచేయాలన్నది తన కల. నేను పనిచేసిన తొలి చిత్రం 'పిచ్చైకారన్' బ్లాక్‌బస్టర్ మూవీగా నిలిచింది. ఇందులోని ప్రతి విజువల్ చాలా బాగుందని మెచ్చుకున్నారు. ఇలాంటి ప్రశంసలు సంతోషంతో పాటు మరింత ఉత్సాహంతో పనిచేసేందుకు తోడ్పడతాయి. సినిమాల ఎంపిక కూడా చాలా జాగ్రత్తగా ఎంచుకుంటున్నారు. దర్శకుడు శశి తెరకెక్కించిన 'నూరు కోడి వానవిల్', 'మద్రాస్‌కారన్' చిత్రాలు విభిన్న కథాంశాలతో రూపొందించినవి. వీటి ట్రైలర్ చాలా బాగున్నాయంటూ అభినందనలు వస్తున్నాయి. నేను పని చేసిన విజయ్ ఆంటోనీ, అంజలి, యోగిబాబు మంచి నటులే కాదు మంచి స్నేహితులు కూడా. 'బహిష్కరణ'లో పాత్రకోసం హీరోయిన్ అంజలి చేసిన కొన్ని సన్నివేశాలను రహస్యంగా చిత్రీకరించాం' అని వివరించారు.

ప్రేక్షకుల సమక్షంలో 'పేచ్చి' సక్సెస్ వేడుకలు



థియేటర్‌లో మూవీ సక్సెస్ వేడుకలు

నిర్మాతలు గోకుల్ బినాయ్, షేక్ ముజీబ్ సంయుక్తంగా బి.రామచంద్రన్ దర్శకత్వంలో నిర్మించిన 'పేచ్చి' చిత్రం ఈ నెల రెండో తేదీన విడుదలై ప్రేక్షకుల పాజిటివ్ టాక్‌తో విజయవంతంగా ప్రదర్శితమవుతుంది. దీంతో చిత్ర బృందం ప్రేక్షకుల సమక్షంలోనే ఓ థియేటర్‌లో సక్సెస్ వేడుకలను ఘనంగా నిర్వహించింది. వెయిలాన్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై రామచంద్రన్ కథ సమకూర్చి దర్శకత్వం వహించారు. గాయత్రి శంకర్, బాలశరవణన్, దేవ్, జానా, ప్రీతి, మహేష్‌లు ప్రధాన పాత్రలు పోషించారు. నిషేధిత కొండ ప్రాంతంపైకి ఐదుగురు స్నేహితులు ఫారెస్ట్ అధికారుల ఆంక్షలను కూడా ట్రెక్కింగ్‌కు వెళతారు. అక్కడ 'పేచ్చి' అనే దెయ్యం చేతిలో చిక్కుకుంటారు. ఆ తర్వాత వారు అక్కడ నుంచి ఎలా తప్పించుకున్నారు? అనే అంశాలను ఎంతో ఆసక్తికరంగా, ప్రేక్షకుల ఉత్కంఠతకు లోనయ్యేలా దర్శకుడు తెరకెక్కించారు. సాధారణ ప్రేక్షకులే అమితంగా భయపెడేలా ప్రతి సన్నివేశం ఉంది. గుండె సంబంధింత సమస్యలతో బాధపడేవారు సాహసం చేసి ఈ సినిమాకు చూసేందుకు వెళ్లాలని మూవీని చూసిన ప్రేక్షకులు సలహా ఇస్తున్నారు. స్క్రీన్‌ప్లేతో పాటు కెమెరా పనితనం, విజువలైజేషన్, ఎడిటింగ్, సంగీతం ఇలా ప్రతి అంశం ఎంతో బాగుందని వారు పేర్కొంటున్నారు. పైగా, విడుదలైన తొలి ఆట నుంచే మంచి స్పందన రావడంతో సినిమా ప్రదర్శించే స్క్రీన్‌ల సంఖ్యను కూడా క్రమంగా పెంచుతున్నారు. దీంతో దర్శక నిర్మాతలు సంతోషం వ్యక్తం చేస్తూ సక్సెస్ వేడుకలను నిర్వహించారు. ఈ సినిమా ప్రదర్శిస్తున్న వడపళని మాల్‌లో ఉన్న థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి కేక్ కట్టింగ్ వేడుకలను నిర్వహించారు.



రిహార్సల్స్‌లో పోలీసు దళాలు

పంద్రాగస్టు రిహార్సల్స్ ప్రారంభం

పెరంబూర్, ఆగస్టు 5: దేశ 76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఈ నెల 15న ప్రజలు కోలాహలంగా జరుపుకోనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు రిహార్సల్స్ ప్రారంభమయ్యాయి. జార్జి కోటలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ జాతీయ పతాకం ఎగురవేయనున్నారు. ఈ సందర్భంగా పోలీసు శాఖలోని విభాగాలు, సీఆర్పీఎఫ్, హోంగార్డ్స్, రిజర్వ్ పోలీసు, అశ్వ దళాలు తదితరాలకు చెందిన పోలీసులు కవాతు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో, స్వాతంత్ర్య దినోత్సవం తొలి రిహార్సల్స్ సోమవారం కామరాజర్ రోడ్డులో జరిగాయి. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నా పోలీసులు రిహార్సల్స్ చేశారు. ఈ రిహార్సల్స్ 9.13 తేదీల్లో జరుగనున్నాయి. రిహార్సల్స్ సందర్భంగా ఉదయం 6 నుంచి కార్యక్రమం ముగిసే వరకు కామరాజర్ రోడ్డుకిరువైపులా వాహనాలు అనుమతించని పోలీసులు, ప్రత్యామ్నాయ మార్గాల్లో పంపించారు.



యూనిఫాం పంపిణీలో రూ.కోట్ల మోసం

ఎడప్పాడి ఆరోపణ ● విద్యార్థులకు 4 జతలు ఇవ్వాలి



అడయార్, ఆగస్టు 5: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసే యూనిఫాంలలో కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డారని మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి ఆరోపించారు. ప్రతి విద్యార్థికి మూడు జతల యూనిఫామ్స్ ఇచ్చి.. లెక్కల్లో మాత్రం నాలుగు జతలు ఇచ్చినట్టుగా చూపించి అవినీతికి పాల్పడ్డారని ఆయన మండిపడ్డారు. ఇదే విషయంపై ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ యేడాది విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్ మూడు జతలు మాత్రమే ఇచ్చారన్నారు. కానీ లెక్కల్లో మాత్రం నాలుగు జతలు ఇచ్చినట్టుగా చూపించారన్నారు. తద్వారా జిల్లా కలెక్టర్లు ప్రభుత్వానికి నష్టం చేకూర్చారని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా, ఈ యూనిఫామ్స్‌కు అవసరమైన దుస్తులను తయారు చేసే పనులను రాష్ట్రంలోని చేనేత కార్మికులకే అప్పగించాలని ఆయన కోరారు. చేనేత వృత్తులను మాత్రమే నమ్ముకునివున్న కార్మికులను ధరల భారం నుంచి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా పనిమయ మాత చర్చి ఉత్సవాలు





ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న బిషప్‌లు - హాజరైన భక్తులు

ఐసిఎఫ్, ఆగస్టు 5: తూత్తుకుడిలో ప్రసిద్ధిచెందిన పవిత్ర పనిమయ మాత చర్చి 442వ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలు జూలై 26వ తేది బిషప్ స్టీఫెన్ ఆధ్వర్యంలో పతాకావిష్కరణతో ప్రారంభమయ్యాయి. మాజీ బిషప్ కుమార్‌రాజా నేతృత్వంలో పనిమయ మాతకు స్వర్ణ మకుటం ధరింపజేసి కార్యక్రమాలు ప్రారంభించారు. ఉత్సవ రోజుల్లో ప్రతిరోజు జప మాల, తిరుబలి, దైవ సందేశం వంటివి జరుగుతున్నాయి. ఉత్సవ ముగింపు సందర్భంగా సోమవారం సాయంత్రం రథోత్సవం జరిగింది. ఈ సందర్భంగా నగర వీధులను విద్యుద్దీపాలతో అలంకరించి వస్తు ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. స్వాగత పతకాలతో భక్తులు ఒకరినొకరు వందన సమర్పణ గావిస్తున్నారు. తెల్లవారుజామున 4.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యేక ఆరాధనలు, ప్రార్థనలు బిషప్, ఫాదర్ల ఆధ్వర్యంలో జరిగాయి. సాయంత్రం 5 గంటలకు పాళయంకోట బిషప్ అంతోనిస్వామి ఆధ్వర్యంలో ఉత్సవ ముగింపు ప్రార్థనలు జరిగాయి. రాత్రి 7 గంటలకు నగర వీధుల్లో రథోత్సవం జరిగింది. 10 గంటలకు కుటుంబ ఆశీర్వాద కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మంత్రి గీతా జీవన్, కలెక్టర్ లక్ష్మిపతి, ఎస్పీ బాలాజీ శరవణన్, తూత్తుకుడి కార్పొరేషన్ మేయర్ జగన్ పెరియస్వామి తదితరులు పాల్గొన్నారు. శ్రీలంక, సింగపూర్ సహా పలు దేశాలకు చెందిన భక్తులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని 900 మంది పోలీసులతో బందోబస్తు చేపట్టగా, సోమవారం జిల్లా సెలవు ప్రకటించారు.

స్వరం దేవుడిచ్చిన వరం

● ఎంసీటీబీసీ కాపరి రాజేంద్ర ప్రసాద్



విజేతలతో రెవ.రాజేంద్ర ప్రసాద్, పోతల ప్రభుదాస్, జాన్సన్ బాబు తదితరులు

ప్యారీస్, ఆగస్టు 5: మానవజన్మలో కొంతమంది గాత్రం మాత్రమే వినసొంపుగా ఉంటుందని, అలాంటి గాత్రాన్ని దేవుడే బహుమతిగా ప్రసాదించారని మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి (ఎంసీటీబీసీ) పాస్టర్ రెవ.డా.ఎస్. రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. వెప్పేరి హైరోడ్డులోని మాతృ సంఘమైన ఎంసీటీబీసీలో ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు నిర్వహించిన పాటల పోటీల్లో అనుబంధ సంఘాలతో పాటు బయట నుంచి సుమారు 22 తెలుగు బాప్టిస్టు సంఘాలు పాల్గొన్నాయి. రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా ప్రముఖ సంగీత దర్శకుడు మేకా జాన్సన్ బాబు వ్యవహరించారు. మొదటి నాలుగు స్థానాల్లో నరసింహ నగర్ కెనాల్, కాట్పాడా, వాటర్‌బరీ మెమోరియల్, నిస్సీ తెలుగు బాప్టిస్టు సంఘాలు నిలిచాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అన్ని సంఘాలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ... పాటల పోటీల్లో ఎంచుకున్న పాటలకు సంబంధించి ఉచ్చరించే తెలుగు పదాలు స్పష్టంగా పలకాలని, సమాజానికి, కుటుంబాలకు కనువిప్పు కలిగించే పాటలు నేర్చుకోవాలని హితవు పలికారు. సంఘ కార్యదర్శి పోతల ప్రభుదాస్ వందన సమర్పణ చేసిన ఈ కార్యక్రమంలో బీవైఎఫ్ డైరెక్టర్ ఎం.సౌదామణి, ఛైర్మెన్ జి.రామయ్య, కోశాధికారి అనమలగుర్తి బాబు, ఐ.మార్క్, బి.విశ్వ, సోపాటి నవీన్, అఖిల నవీన్, సువార్తమ్మ, సరోజమ్మ, మహేష్ సహా సంఘాల పెద్దలు, బోధకులు పాల్గొన్నారు.

పళని నుంచి మదురైకి 24 అడుగుల కరుప్పన్‌స్వామి విగ్రహం





విగ్రహానికి పూజలు చేస్తున్న దృశ్యం - భారీ క్రేన్ సాయంతో విగ్రహాన్ని లారీపై ఉంచుతున్న దృశ్యం

పెరంబూర్, ఆగస్టు 5: మదురైలోని ఆలయంలో ప్రతిష్ఠించేందుకు 24 అడుగుల ఎత్తులో పళని నుంచి ఒకేరాయితో రూపొందించిన కరుప్పన్‌స్వామి విగ్రహాన్ని లారీలో పంపించారు. మదురై అరుప్పుకోట బైపాస్ రోడ్డులో కొత్తగానిర్మిస్తున్న ఆలయంలో కరుప్పన్‌స్వామి విగ్రహం ప్రతిష్ఠించాలని ఆలయ నిర్వాహకులు నిర్ణయించారు.అందుకోసం దిండుగల్ జిల్లా పళనిలోని శిల్ప కళాక్షేత్రంలో విగ్రహం తయారీ బాధ్యతలు అప్పగించారు. 8 నెలలుగా ముగ్గురు శిల్ప కళాకారులు, 70 టన్నుల బరువైన రాతితో 24 అడుగుల ఎత్తున్న కరుప్పన్‌స్వామి విగ్రహాన్ని రూపొందించే పనులు చేపట్టారు. ఈ పనులు ముగియడంతో విగ్రహాన్ని మదురైకి తరలించేందుకు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం భారీ క్రేన్ సాయంతో ప్రత్యేక ట్రాలీలో విగ్రహాన్ని ఉంచారు. ఈ విగ్రహాన్ని త్వరలో ఆలయంలో ప్రతిష్ఠించి కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు, విగ్రహానికి మొత్తం రూ.17 లక్షల ఖర్చయిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



తిరుచెందూర్‌లో 2వ రోజూ వెనక్కి వెళ్లిన సముద్రం

పెరంబూర్, ఆగస్టు 5: తిరుచెందూర్‌లో సముద్రం 50 అడుగుల వెనక్కి వెళ్లింది. తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్‌లో ప్రసిద్ధి చెందిన మురుగన్ ఆలయానికి ప్రతిరోజు వేలాది మంది భక్తులు వచ్చి స్వామి దర్శనం చేసుకొని పూజలు చేస్తుంటారు. ఆలయానికి వచ్చే భక్తులు ముందుగా సమీపంలోని సముద్రతీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. ఆడి అమవాస్య సందర్భంగా ఆదివారం భక్తులతో సముద్రతీరం, ఆలయం కిటకిటలాడింది. ఈ నేపథ్యంలో, ఆదివారం ఉదయం హఠాత్తుగా సముద్రం 50 అడుగుల వెనక్కి వెళ్లడంతో భక్తులు భయాందోళన చెందారు. సముద్రం వెనక్కి వెళ్లడంతో బండరాళ్లు,పాచి,కొన్ని సముద్రపు జీవరాశులు బయటపడ్డాయి. గంట సేపటి తర్వాత సముద్రం యధాస్థితికి చేరుకుంది. ఈ నేపథ్యంలో, సోమవారం కూడా ఉదయం హఠాత్తుగా సముద్రం వెనక్కి వెళ్లి, కొద్దిసేపటి తర్వాత యధాస్థితికి చేరుకుంది. సునామీ అనంతరం అమావాస్య, పౌర్ణమి రోజుల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నట్లు ఆ ప్రాంత జాలర్లు తెలిపారు.

వయనాడ్ బాధితులకు వీఐటీ రూ.కోటి విరాళం



పినరయి విజయన్‌కు చెక్కు అందజేస్తున్న విశ్వనాథన్ బృందం

చెన్నై, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కేరళలోని వయనాడ్ బాధితులను ఆదుకోవడంపై వేలూరులోని వీఐటీ యూనివర్సిటీ స్పందించింది. బాధితులకు సహాయ చర్యలు చేపట్టేందుకు రూ.కోటి విరాళం అందించింది. ఈ మేరకు వీఐటీ వ్యవస్థాపకులు డాక్టర్ జి.విశ్వనాథన్ సోమవారం తిరువనంతపురంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కలిసి చెక్కు అందజేశారు. అంతేగాక బాధితులకు ముమ్ముందుకూడా అండగా వుంటామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, డాక్టర్ జీవీ సెల్వం, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కాదంబరి ఎస్. తదితరులు కూడా పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు విద్యార్థులను తీసుకొస్తే చర్యలు

● తంజావూరు కలెక్టర్ హెచ్చరిక



విద్యార్థులను బడికి పంపించాలని హెచ్చరిస్తున్న కలెక్టర్

పెరంబూర్, ఆగస్టు 5: ప్రజా సమస్యల పరిష్కార శిబిరాలకు పాఠశాల విద్యార్థులను తీసుకొస్తే కఠిన చర్యలు తీసుకుంటానని తంజావూరు జిల్లా కలెక్టర్ పి.ప్రియాంక పంకజం హెచ్చరించారు. తంజావూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రజలు వినతిపత్రాలను కలెక్టర్‌కు అందజేశారు. ఈ నేపథ్యంలో, తమ ప్రాంతానికి బస్సు కావాలని కోరుతూ పుదుపట్టి ప్రాంతానికి చెందిన ప్రజలు పాఠశాల విద్యార్థులతో వచ్చి వినతిపత్రం సమర్పించారు. దీంతో ఆగ్రహించిన కలెక్టర్... విద్యార్థులను పాఠశాలకు వెళ్లనివ్వకుండా ఇక్కడకు తీసుకురావడం సరికాదన్నారు. మొదట పిల్లలను పాఠశాలలకు పంపి, ఆ తర్వాత వచ్చి వినతిపత్రం ఇవ్వాలని సూచించారు. కొద్దిసేపటి తరువాత తంజావూరు మేలవెలి పంచాయతి వార్డు సభ్యుడు అయ్యప్పన్ నేతృత్వంలో ఆ ప్రాంతానికి చెందిన పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు యూనిఫాంతో వినతిపత్రం అందించేందుకు వచ్చారు. మళ్లీ విద్యార్థులతో వేరొకరు రావడాన్ని గమనించిన కలెక్టర్ వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వినతిపత్రం అందించేందుకు వస్తున్న మీరు ఎందుకు విద్యార్థులకు తీసుకొస్తున్నారు? ఇది మంచి పద్ధతి కాదు, చట్టప్రకారం నేరమని తెలిపారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృత్తమైతే సదరు వ్యక్తులపై కఠిన చర్యలు చేపడతామని కలెక్టర్ హెచ్చరించారు.

ఘనంగా ఏవీఐటీ స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో డిగ్రీని స్వీకరిస్తున్న విద్యార్థి

అడయార్, ఆగస్టు 5: ఆరుపడై వీడు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఏవీఐటీ) 21వ స్నాతకోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఏవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సెల్వకుమార్ స్వాగతోపన్యాసం చేశారు. స్నాతకోత్సవ నివేదికను డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీఎస్ బాలగణపతి సమర్పించారు. వినాయక రీసెర్చ్ మిషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ అనురాధ గణేష్ అధ్యక్షోపన్యాసం చేశారు. ఈ స్నాతకోత్సవంలో వివిధ విభాగాలకు చెందిన సుమారుగా 500 మంది విద్యార్థులు డిగ్రీలను స్వీకరించారు. ఇందులో వీఎంఆర్ఎఫ్ (డీమ్డ్ విశ్వవిద్యాలయం) బోర్డ్ మేనేజ్‌మెంట్ మెంబర్ జే.సురేష్ శ్యామ్యూల్‌ను ప్రత్యేకంగా సన్మానించారు.



తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి ఎమ్మెల్యే గోవిందరాజన్ సోమవారం ప్రజలకు సహాయాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షులు సెవ్వంటి మనోజ్, జిల్లా అభివృద్ధి అధికారి చంద్రశేఖర్ తదితరులు కూడా పాల్గొన్నారు.